# అద్దమంటి హృదయం

-రాంభూపాల్ రెడ్డి

''అదిగో లావణ్య. మిద్దెమీద వుంది'' ఎగ్జయిటింగ్‌గా అన్నాడు విజయ్.

''నాక్కూడా కనిపిస్తోంది. అంతగా టెన్షన్ పడకు. మనమిప్పుడు ఆమె దగ్గరకే కదా వెళ్లేది'' చిన్నగా నవ్వుతూ చెప్పాడు శ్యామ్.

వీళ్లిద్దరూ రావడం చూసి మెట్లు దిగి కిందకి వచ్చింది లావణ్య. పేరుకు తగ్గ సౌందర్యరాశి. తెల్లటి పంజాబీ డ్రెస్‌లో మెట్లు దిగివస్తున్న ఆమెను చూసి నింగినుంచి తన కోసం దిగివస్తున్న దేవతలాగా ఫీలయ్యాడు విజయ్.

''బాగున్నారా! హైదరాబాద్ నుంచి ఎప్పుడు వచ్చారు?'' నవ్వుతూ అడిగిందామె విజయ్‌నుద్దేశించి.

''ఈరోజు ఉదయమే వచ్చాను'' చెప్పాడతను.

''రండి. లోపలికెళ్దాం'' అంటూ ఇంట్లోకి తీసుకెళ్లింది ఇద్దరినీ.

వాళ్లిద్దరినీ హాల్లో కూర్చోబెట్టి ఆమె లోపలికి వెళ్లింది టీ తెస్తానంటూ.

లోపల్నించి లావణ్య వాళ్లమ్మ ''బాగున్నావా బాబూ'' అంటూ వచ్చి పలకరించింది విజయ్‌ని. బదులుగా తల వూపుతూ చిన్నగా నవ్వాడు విజయ్. లావణ్య ట్రేలో బిస్కట్లు, టీ పట్టుకొచ్చింది.

శ్యామ్ లావణ్యకు వరుసకు కజిన్ అవుతాడు. అతనికి వాళ్లతో పరిచయమెక్కువ వుండటం వల్ల వాళ్లతో ఫ్రీగా మాట్లాడుతున్నాడు. విజయ్ పరిస్థితి భిన్నంగా వుంది. వాళ్లమ్మ ముందు మాట్లాడటానికి అతనికి మొహమాటంగా వుంది. అతని మనస్సు లావణ్యతో కాస్సేపు ఫ్రీగా మాట్లాడాలని కోరుకుంటోంది. టీ త్రాగాక శ్యామ్ చేతిమీద చిన్నగా తట్టాడు. అతనికి తెలుసు ఆ పరిస్థితి కల్పించగల చనువు శ్యామ్‌కు వుందని. శ్యామ్‌కు విజయ్ పరిస్థితి అర్థమయ్యింది.

లోపల రూమ్‌లోనుంచి టేప్ రికార్డర్‌లోంచి ఏదో పాట చిన్నగా వినిపిస్తోంది. ''ఏమైనా కొత్త క్యాసెట్లు కొన్నారా?'' అంటూ శ్యామ్ ఆ గదిలోకి నడిచాడు.

''ఏమీ కొన్లేదు'' అని లోనికి వెళ్తూ మీరూ రండి అంటూ విజయ్‌ను పిలిచిందామె. లావణ్యకు తెలుసు. విజయ్ తనను ఇష్టపడుతున్నాడని.

విజయ్ గదిలోకి వెళ్లి శ్యామ్‌తోపాటు క్యాసెట్లు చూస్తూ నిలబడ్డాడు.

అతనికి ప్రక్కనే గోడమీద వున్న లావణ్య ఫోటో కనిపించింది. క్లోజప్‌లో నవ్వుతూ వున్నప్పుడు తీసిన ఫోటో అది. అందంగా లామినేట్ చేయబడి వుంది. నవ్వుతూ వున్న ఆమె అందమైన మొహాన్ని చూస్తుంటే అతనికి మనసులో వెన్నెల కురుస్తున్న అనుభూతి కలిగింది. అతని దృష్టి ఫోటో చివర్లో వున్న అక్షరాల మీద పడింది.

''విత్ లవ్... శ్రీనివాస్'' అని రాసి వుంది. అది చూడగానే అతని మొహంలోని రంగులు మారిపోయాయి. మనసంతా చేదుగా అయ్యింది.

వాళ్లతో మామూలుగానే మాట్లాడుతున్నాడుగానీ 'శ్రీనివాస్' గురించే ఆలోచిస్తున్నాడు. ''ఎవరతను? ఇంట్లో ఇంత బహిరంగంగా ఫోటోపై అతని పేరు వుందంటే ఇంట్లో అందరికీ అతని గురించి తెలిసేవుండాలి. లావణ్య కూడా అతన్ని ఇష్టపడుతుండాలి. లేకుంటే ఆ ఫోటో ఇక్కడెందుకుంటుంది.'' ఆ ఆలోచన కలుగగానే అతనికి తన గుండెనెవరో పదునైన కత్తితో కోస్తున్న భావన కలిగింది.

ఇక అక్కడ వుండలేక వెళ్లొస్తానంటూ శ్యామ్‌ను తీసుకొని బయటకు వచ్చేశాడతను. ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు. విజయ్‌కు గుండెల్లో బాధ క్రమక్రమంగా పెరుగుతోంది.

''శ్రీనివాస్ గురించి ఆలోచిస్తున్నావా?'' ఉన్నట్టుండి అడిగాడు శ్యామ్.

''అంటే నీకు ముందే శ్రీనివాస్ గురించి తెలుసా?'' ఆశ్చర్యంగా అడిగాడు విజయ్.

''తెలుసు. నీవు లావణ్య మీద మనసు పడ్డావని తెలిసినప్పటినుంచీ ఎప్పటికప్పుడు చెప్దామనుకున్నాను కానీ చెప్పలేకపోయాను.''

''ఎవరతను? ఎక్కడ వుంటాడు? అతనికీ లావణ్యకీ ఏమిటి సంబంధం?'' ఆతృతగా ప్రశ్నల వర్షం కురిపించాడు విజయ్.

''శ్రీనివాస్ లావణ్యకు డిగ్రీలో క్లాస్‌మేట్. వాళ్లిద్దరూ ఒకర్నొకరు ప్రేమించుకున్నారు. శ్రీనివాస్‌కు ఆస్తిపాస్తులు ఏమీ లేకపోవడం, కుటుంబ బాధ్యతలు ఎక్కువగా వుండటం వల్ల లావణ్య వాళ్ల అమ్మానాన్నలకు వాళ్లిద్దరికీ పెళ్లిచేయడం ఇష్టంలేదు. అందుకే శ్రీనివాస్ కూడా వేరే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని తెలిసింది. లావణ్య ఈ వూరికి వచ్చి దాదాపు సంవత్సరం కావస్తోంది. మొదట్లో ఇంట్లోవాళ్లతో గొడవ పడుతూ అందరితోనూ మూడీగా వుండేది. నేను అప్పుడప్పుడూ వస్తూ ఆమె శ్రీనివాస్‌ను మరచిపోయేలా చేసేందుకు సరదాగా కబుర్లు చెబుతుండేవాడిని. నిన్ను పరిచయం చేసిన తరువాత ఎక్కువగా నీ జోవియల్ నేచర్ గురించీ, నీ జోక్స్ గురించీ చెప్పేవాణ్ణి. బాగా ఎంజాయ్ చేసేది. అందుకే నీవు వచ్చినప్పుడంతా నవ్వుతూ మంచిగా పలకరిస్తోంది'' అంటూ మొత్తం విషయం చెప్పాడు శ్యామ్.

• • •

విజయ్‌కు నిద్ర రావడంలేదు. రేపే లావణ్య బర్త్‌డే. అసలందుకొరకే రెండ్రోజులు ఆఫీసుకు సెలవు పెట్టి మరీ వచ్చాడు. సన్‌డే కూడా కలిసి రావడంతో మొత్తం మూడురోజులు దొరికింది.

అంతకుముందురోజే శ్యామ్ చెప్పిన విషయాలు అతనింకా జీర్ణించుకోలేకపోతున్నాడు. అసలు అప్పుడే హైదరాబాద్ వెళ్లిపోదామనుకున్నాడు కానీ వెళ్లలేక, వుండలేక సతమతమవుతున్నాడు.

శ్యామ్ ద్వారా లావణ్య పరిచయమైన రోజునే అతనికి ఆమెపై ఇష్టం ఏర్పడింది. అది ప్రేమగా మారి రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు శ్రీనివాస్ విషయం తెలియడంతో సున్నితమైన అతని మనసు తట్టుకోలేకపోతోంది. కానీ ఒక్క విషయం మాత్రం అతనికి బాగా అర్థమవుతోంది. ''లావణ్య లేని జీవితాన్ని తాను ఊహించుకోలేడు. తనామెను ప్రేమించాడు. తనకు ఆమె కావాలి. అంతే తప్ప లావణ్యను ప్రేమించినప్పుడు ఆమె గతమేమిటని తను ఆలోచించలేదు. ముందు తన ప్రేమను ఆమెకు తెలియచేయాలి. అందుకు రేపే సరైన రోజు'' ఈ నిర్ణయం తీసుకున్న తరువాత అతనికి హాయిగా నిద్ర పట్టింది.

• • •



తలంటుపోసుకున్న తరువాత దైవ ప్రార్థన ముగించుకుని రూమ్‌లో కూర్చుంది లావణ్య. ఆమె అన్ని పనులూ చేసుకుంటున్నా వాటిలో జీవంలేదు. ఆసక్తి కరువైంది. నిర్లిప్తత చోటుచేసుకొంది. ఎందుకో ఆమెకు విజయ్ గుర్తుకొచ్చాడు. ఆరోజు తన ఫోటో చూసిన తరువాత అతను మూడీగా మారడం, మళ్ళీ రాకపోవడం గుర్తుకు వచ్చిందామెకు. చిన్నగా నిట్టూర్చిందామె.

ఇంతలో దూరంగా ఒంటరిగా వస్తున్న విజయ్ కిటికీలోంచి కనిపించాడామెకు. ఆమెకు కొద్దిగా ఆశ్చర్యమేసింది. ఇంతవరకూ అతనెప్పుడూ ఒంటరిగా వాళ్ళింటికి రాలేదు. ఆమె లేచి బయటికొచ్చి నిలబడ్డది.

గేటు తీసుకుని లోపలికి వస్తూ తలంటు పోసుకుని కడిగిన ముత్యంలా వున్న ఆమెను ఒక్క క్షణం కన్నార్పకుండా చూశాడతను. చేతిలోని గ్రీటింగ్ కార్డ్ ఆమెకిస్తూ 'మెనీ హ్యాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే' అంటూ బర్త్‌డే విషెస్ చెప్పాడు.

ఇద్దరూ హాల్లో కూర్చున్నారు. ఇద్దరికీ ఇబ్బందిగా వుంది. ఒకరి మనసులో ఏముందో ఇంకొకరికి తెలుసు.

లావణ్య గ్రీటింగ్ కార్డ్ ఓపెన్ చేసింది. లోపల చిన్న లెటర్ ఒకటి అతికించి వుంది. ''మీరంటే నాకిష్టం. మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. మీకు అంగీకారమైతే ఈరోజు సాయంత్రం ఆరు గంటలకు గుడికి రండి. లేదంటే మీదగ్గర ఇంకెప్పుడూ ఈ ప్రస్తావన తీసుకురాను'' అని రాసి వుందందులో.

లావణ్య తలెత్తి విజయ్ కళ్ళల్లోకి చూసింది. విజయ్ మౌనంగా వెళ్ళొస్తానన్నట్టు తలవూపి బయటకు నడిచాడు.

ఆమెకు శ్రీనివాస్ గుర్తుకొచ్చాడు. అతనితో గడిపిన మధుర క్షణాలు గుర్తుకు వచ్చాయి. అవి మళ్ళీ రావని తెలుసు. ''తన హృదయం ఇప్పుడు పగిలిన అద్దం లాంటిది. ఇప్పుడు తను కాదంటే విజయ్ పరిస్థితి కూడా అలాగే వుంటుంది. ప్రేమించిన వ్యక్తిని పొందలేని బాధ ఎంత దుర్భరంగా వుంటుందో తనకు తెలిసీ ఇప్పుడు ఇంకో మనసును క్షోభ పెట్టడం ఎంతవరకూ సమంజసం'' ఆమె ఆలోచిస్తోంది.

• • •

గుళ్ళో ఒక మూల కూర్చున్న విజయ్ చాలా ప్రశాంతంగా కనిపిస్తున్నాడు. అతని మనసులో మాత్రం లావణ్య వస్తుందో, రాదోననే భయం తాలూకు నీడలు కదలాడుతున్నాయి. సరిగ్గా ఆరు అవుతుండగా గుడిమెట్లెక్కి లోపలికి వస్తున్న లావణ్య కనిపించిందతనికి. గుళ్ళోనూ, అతని గుండెల్లోనూ ఒకేసారి గంటలు మోగాయి.

★